సాక్షి అనకాపల్లి

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



కశింకోటలో ఈద్గా మసీదు వద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కశింకోటలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం చిన్నారులు

సమత.. మమత.. మానవత

జిల్లా అంతటా ఆనందోత్సాహాలతో రంజాన్ వేడుకలు

అనకాపల్లి టౌన్/కశింకోట: ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కశింకోటలోని నూకాంబిక ఆలయ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద, అనకాపల్లి జామియా మసీదులో శనివారం సంప్రదాయంగా సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు అల్లా బోధనలను వినిపించారు. పేదలకు ఆర్థిక సాయం, వస్త్రదానం చేశారు. స్నేహ భావం వెల్లివిరిసేలా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనకాపల్లి జామియా మసీదు, శారదనగర్ ఈద్గా మసీదుల్లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ సత్యవతి ప్రార్థనలు చేశారు. ఈద్గా మసీదు చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తన వంతు సహాయం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి బీశెట్టి జగన్ పాల్గొన్నారు.



అనకాపల్లి ఈద్గా మసీదులో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

చందనసేవకు వేళాయె..

- నేడే సింహాద్రి అప్పన్న చందనోత్సవం
- ఉదయం 4 గంటల నుంచి సర్వదర్శనం
- శోభాయమానంగా సింహగిరి



విద్యుత్ దీపాల అలంకరణలో సింహగిరి



అప్పన్న నిజరూపం

సింహాచలం: దుష్టసంహారానికి ఉగ్రరూపధారియైన నృసింహుడు భక్తుల అభీష్టం నెరవేర్చేందుకు అనేక చోట్ల స్వయంభువుగా వెలిశాడు. అలాంటి ప్రసిద్ధ క్షేత్రాలలో సింహగిరి ఒకటి. తూర్పు కనుమలలో ప్రకృతి సౌందర్యం నడుమ సింహాద్రిపై పశ్చిమాభిముఖుడైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహుడు అశేష భక్తకోటికి ఇష్టదైవం. వైశాఖ శుద్ధ తదియ నాడు భక్తజనకోటికి నిజరూప దర్శనం అనుగ్రహిస్తాడు. చందనయాత్ర నాడు నిజరూపాన్ని దర్శిస్తే వైకుంఠంలో లక్ష్మీనారాయణులను దర్శించినంత ఫలితమని క్షేత్ర మహాత్మ్యం పేర్కొంటోంది.

ఆదివారం జరగనున్న చందనోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. స్వామివారిపై ఉన్న చందనాన్ని శాస్త్రోక్తంగా ఒలిచి నిజరూప భరితున్ని చేస్తారు. అనంతరం దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకు తొలి దర్శనం కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పిస్తారు. టీటీడీ తరఫున సంప్రదాయ వస్త్రసమర్పణ ఉంటుంది. ఉదయం 4 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనం అందజేస్తారు. రాత్రి 7 గంటల వరకే భక్తులను క్యూల్లోకి అనుమతిస్తారు. తరువాత క్యూల ప్రవేశ ద్వారాలు మూసివేసి అప్పటి వరకు క్యూల్లో ఉన్న భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పిస్తారు. రాత్రి 8.30 గంటల నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో స్వామికి సహస్ర ఘటాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సింహగిరిపై ఉన్న గంగధార వద్ద నుంచి శ్రీవైష్ణవ స్వాములు కలశాలతో నీటిని తీసుకురాగా స్వామికి అభిషేకం చేస్తారు. పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి విశేష పూజలు నిర్వహించిన అనంతరం స్వామికి తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని సమర్పిస్తారు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఈసారి 1.50 లక్షల మంది భక్తులు వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. సర్వదర్శనంతో పాటు రూ.300, రూ.1000 దర్శనం టికెట్లు, రూ.1500 వీవీఐపీల టికెట్లు అందుబాటులో ఉంచారు. తొలిసారిగా రూ.300, రూ.1000 టికెట్లు ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిపారు. కాగా రూ.300 దర్శనం టికెట్లపై వచ్చేవారికి కూడా వివిధ స్లాట్లలో దర్శన సమయాన్ని కేటాయించారు. కలెక్టర్ మల్లికార్జున, దేవస్థానం ఈవో త్రినాథరావు, జీవీఎంసీ, ఫైర్, ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్, పోలీస్, ఫైర్, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు.

కాగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ ఆధ్వర్యంలో పన్నెండు వందల మందికి పైగా పోలీసులు చందనోత్సవం బందోబస్తు నిర్వహించనున్నారు. చందనోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలోని ప్రహ్లాదమండపాన్ని విశేషంగా పూలతో అలంకరించారు.

చందనంలో సుగంధ ద్రవ్యాల మేళవింపు

చందనోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చిచందనంలో శనివారం దేవస్థానం అర్చకులు పలు రకాల సుగంధ ద్రవ్యాలను కలిపారు. ఈ చందనాన్ని ఆదివారం రాత్రి సహస్ర ఘటాభిషేకం అనంతరం స్వామికి సమర్పించనున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



చందనంలో సుగంధ ద్రవ్యాలను కలుపుతున్న అర్చకులు

నిరుద్యోగులను మోసగించిన దగాకోరు చంద్రబాబు

- ఆ నయవంచనను రాష్ట్ర యువత మర్చిపోలేదు
- ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు భృతి అంటూ నాడు మోసం
- ఎన్నికలు సమీపించడంతో బాబు, జాబు అంటూ అవే కుట్రలు మళ్లీ ప్రారంభం
- జగన్ పాలనలో ఒకే నోటిఫికేషన్‌తో 1.35 లక్షల సచివాలయ ఉద్యోగాల కల్పన
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



విలేకర్లతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: చంద్రబాబు నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన దగాకోరని, ఆయన నమ్మక ద్రోహాన్ని రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఇంకా మర్చిపోలేదని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. తారువ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలు సమీపించడంతో నిరుద్యోగులను మభ్యపెట్టేందుకు బాబు, జాబు అంటూ మళ్లీ పాత రాగం అందుకున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. 2014 ఎన్నికల్లో జాబు రావాలంటే బాబు రావాలి, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు భృతి అంటూ మాయ మాటలతో అధికారంలోకి వచ్చి యువతను ఘోరంగా మోసగించారని ధ్వజమెత్తారు. టీడీపీ పాలనలో 2014–2019 మధ్య ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో, ఎంత మందికి 2 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇచ్చారో చెప్పాలన్నారు. ఇంటికో ఉద్యోగం లేదు సరికదా నిరుద్యోగ భృతి సైతం 2018 అక్టోబర్‌లో సరిగ్గా ఎన్నికలకు ఐదు నెలలు ముందు కేవలం రూ.1000 చొప్పున అరకొరగా ఇచ్చి మమా అనిపించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. లబ్ధిదారుల ఎంపికను జన్మభూమి కమిటీలకు అప్పగించి లబ్ధిదారుల సంఖ్యలో సైతం భారీగా కోత విధించారన్నారు. సీఎంగా పగ్గాలు చేపట్టిన తొలి ఏడాదిలోనే ఒకే నోటిఫికేషన్‌తో లక్షా 35 వేల సచివాలయ ఉద్యోగాలను కల్పించిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. విద్య, వైద్య రంగాలలో వేలాది ఉద్యోగాలు కల్పించారన్నారు. పైరవీలకు, అవినీతికి తావు లేకుండా మెరిట్ ఆధారంగా ఎంపిక చేశారన్నారు. పైసా అవినీతి లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి పేద ప్రజల గుండెల్లో సీఎం జగన్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. నయవంచకుడైన చంద్రబాబును మరో మారు ఘోరంగా ఓడించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో చిన్నపాటి ఉద్యోగానికి లక్షల్లో లంచాలు దండుకున్న చంద్రబాబు అండ్ ఎల్లో బ్యాచ్‌కు సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. విలేకరుల సమావేశంలో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలుగా తారువ, మార్టూరు

సాక్షి, అనకాపల్లి: రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా దేవరాపల్లి మండలం తారువ గ్రామ పంచాయతీ, అనకాపల్లి మండలం మార్టూరు పంచాయతీలు ఎంపికయ్యాయి. శనివారం 9 విభాగాలలో పురస్కారాలు ప్రకటించగా అందులో జిల్లా నుంచి రెండు పంచాయతీలకు స్థానం లభించింది. ఆరోగ్య పంచాయతీగా తారువ, మహిళా సంక్షేమ పంచాయతీగా మార్టూరు ఎంపికయ్యాయి. ఈ నెల 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగే కార్యక్రమంలో సర్పంచ్‌లు పురస్కారం అందుకోనున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కూడా పాల్గొనాలని సూచించారు.

మెయిన్ రోడ్డు విస్తరణపై సర్వే

నర్సీపట్నం: మెయిన్ రోడ్డు విస్తరణపై విశాఖపట్నం టౌన్ ప్లానింగ్ ఆర్డీడీ అధికారులు శనివారం సర్వే చేశారు. ఈ పనులకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. విస్తరణకు సంబంధించిన ప్లాన్ అనుమతి కోరుతూ ఆర్డీపీకి నివేదించారు. విశాఖ టౌనింగ్ ప్లానింగ్ అధికారి భార్గవి నేతృత్వంలో మెయిన్ రోడ్డు కొలతలను పునఃపరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పక్కాగా మెయిన్ రోడ్డు సర్వే చేశారు. త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు అధికార యంత్రాంగం వెల్లడించింది.

కూల్ కూల్!

- భానుడి భగభగల నుంచి ఉపశమనం
- గణనీయంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- వడగాడ్పులకు కొన్నాళ్లు విరామం
- మూడ్రోజులు అకాల వర్షాలు, ఈదురుగాలులు
- ద్రోణి, గాలుల ప్రభావంతో మారిన వాతావరణం



రావికమతం మండలం చీమలపాడు రూట్లో విరిగిన వృక్షం

సాక్షి, విశాఖపట్నం: దాదాపు మూడు వారాల నుంచి భానుడు భగభగలాడుతున్నాడు. అత్యధిక ఉష్ణోగ్రతలతో జనాన్ని అల్లాడిస్తున్నాడు. మే నెలలో చవిచూసే ఉష్ణతాపాన్ని ఏప్రిల్ ఆరంభం నుంచే వెదజల్లుతున్నాడు. సాధారణంకంటే గరిష్టంగా ఏడు డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లాలోని పద్మనాభం, కోటవురట్ల ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. విశాఖ నగరంలోనూ 42 డిగ్రీల వరకు నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటు చేసుకుంది. ఉష్ణోగ్రతలు అనూహ్యంగా తగ్గుముఖం పట్టాయి. శనివారం ఉమ్మడి విశాఖలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల (40 డిగ్రీలు నమోదు) మినహా మిగతా ప్రాంతాల్లో 38 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో ఉష్ణతాపం నుంచి ఉపశమనం లభించినట్టవుతోంది.

సుడిగాలి అలజడి

శనివారం సాయంత్రం వరకు సాధారణ పరిస్థితే నెలకొంది. మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై చల్లదనం పరచుకుంది. కారుమబ్బులు కమ్ముకున్నాయి. కాసేపటికే ఈదురుగాలులు మొదలయ్యాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇళ్ల పైకప్పులు, రేకులు ఎగిరి పడ్డాయి. రానున్న మూడు రోజులు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అదే సమయంలో పిడుగులకు ఆస్కారం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దేవరాపల్లి మండలం నాగయ్యపేట, కె.కోటపాడు మండలం బత్తివానిపాలెంలో పిడుగుపాటుకు రెండు ఆవులు, మాడుగులలో గేదె మృతి చెందాయి.

ఈదురు గాలులతో భారీ వర్షం

రావికమతం: మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. వరుసగా 15 రోజులుగా ఎండలు మండుతున్నాయి. శనివారం నాడూ మధ్యాహ్నం వరకూ ఎండ గట్టిగానే కాచింది. అయితే సాయంత్రం 4 గంటల ప్రాంతంలో దట్టమైన మబ్బులు కమ్ముకుని బలమైన ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈ గాలులకు పి.పొన్నవోలు సమీపంలో హైటెన్షన్ లైన్ వైర్లు తెగిపడ్డాయి. చీమలపాడు రూట్లో భారీ చెట్టు విద్యుత్ వైర్లపై విరిగి పడింది. దీంతో ఎక్కడికక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో సిబ్బంది సరఫరా పునరుద్ధరణ పనిలో న్నారు. ఈ గాలులకు రావికమతం,కొత్తకోట, మత్స్యపురం,మర్రివలస తదితర గ్రామాలలో మామిడి కాయలు నేల రాలిపోయాయి.దొండపూడి ఫారెస్ట్ థానా స్తంబాలు సైతం గాలులకు విరిగిపోయాయి. అయితే ఎండలకు ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు ఈ చల్లని గాలులకు ఎంతగానో సేదతీరారు. వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.



రావికమతం మండలం మత్స్యపురంలో రాలిన మామిడి కాయలు

రూ. 3 కోట్ల రంగురాళ్లు!

- పొక్లెయిన్లతో భారీగా తవ్వకాలు.. లారీల్లో మట్టి తరలింపు
- సాలికమల్లవరంలో అర్ధరాత్రి రహస్య కార్యకలాపాలు
- అటవీ శాఖ సిబ్బంది పాత్రపై అనుమానాలు



క్వారీ ప్రాంతాన్ని పరిశీలించిన డీఎఫ్‌వో, ఎస్‌ఐ నారాయణరావు

గొలుగొండ: కూలీలను పురమాయించి రోజుల తరబడి తవ్వకాలు జరపడం పాత మాట.. పొక్లెయిన్‌తో కొద్ది గంటల్లోనే భారీ ఎత్తున మట్టిని తవ్వి లారీల్లో తరలించడం కొత్త బాట. రంగురాళ్ల వ్యాపారులు రూటు మార్చారు. సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన కార్యకలాపాలు దీనిని తేటతెల్లం చేస్తున్నాయి. తాజాగా తవ్విన మట్టి విలువ మూడు కోట్ల రూపాయలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గతంలో 40 మూట్ల మట్టి తవ్వగా వాటిలో కోటి విలువైన రంగురాళ్లు బయటపడ్డాయి. అలాంటిది ఇప్పుడు లారీతో మట్టి తరలించడం వలన అత్యంత విలువైన రంగురాళ్లు లభించి ఉంటాయని భావిస్తున్నారు. అటవీశాఖ సహకారంతోనే ఈ తంతు జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. యంత్రాల సాయంతో తవ్వకాలు జరగడం రంగురాళ్ల చరిత్రలో ఇదే ప్రథమమని చెబుతున్నారు. గొలుగొండ మండలంలో 1995లో పప్పుశెట్టిపాలెం క్వారీ బయటపడింది. 2002లో కరక రిజర్వ్ ఫారెస్టులో సుమారు 8 రంగురాళ్ల క్వారీలు వెలుగుచూశాయి. 2006లో ఆరిల్లోవ రిజర్వ్ ఫారెస్టులో, 2009లో సాలికమల్లవరం కొండపైన, 2015లో సాలికమల్లవరం గ్రామ సమీపంలో క్వారీలు పడ్డాయి. ఈ మండలంలో ఇప్పటి వరకు రిజర్వ్ ఫారెస్టుతోపాటు జిరాయితీ పరిధిలో 30 వరకు రంగురాళ్ల క్వారీలు పడ్డాయి. వ్యాపారులు, తవ్వకందార్లు క్వారీల్లో దొంగచాటున మట్టి తవ్వుకొని బయటకు తీసుకువెళ్లి కడిగి రంగురాళ్లు సేకరించేవారు. ఇప్పుడు పొక్లెయిన్ల సాయంతో లూజు మట్టిని బయటకు తీసి అసలు రంగురాళ్ల మట్టిని లారీపై వేసి గొలుగొండ, నాతవరం సరిహద్దులకు తీసుకువెళ్లారు.

కోట్ల విలువైన రంగురాళ్లకు నిలయం

సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీ కరక రిజర్వ్ ఫారెస్టు పరిధిలో ఉంది. ఈ క్వారీ గ్రామాన్ని ఆనుకొని 800 మీటర్ల దూరంలో 10 సంవత్సరాల క్రితం బయటపడింది. తరుచూ రంగురాళ్ల తవ్వకాలు జరగడంతో పోలీసులకు, అటవీశాఖకు తలనొప్పిగా మారేది. ఈ క్వారీలో 2018 వరకు సుమారు రూ.10 కోట్ల మేర రంగురాళ్లు బయటపడ్డాయి. ఈ సమస్య అధికం కావడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు ఇక్కడ బేస్ క్యాంప్ ఏర్పాటు చేశారు. రాత్రి, పగలు గస్తీ నిర్వహించడంతోపాటు రాత్రి సమయంలో నలుగురు సిబ్బంది కాపలా ఉండేవారు. క్యాట్ ఐ రకానికి చెందిన రంగురాళ్లు ఇక్కడ దొరకడంతో వీటిని ఎలాగైనా దక్కించుకోవాలని నిఘా ఏర్పాటు చేసి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఈ తవ్వకాలు నిర్వహించారు.

గస్తీ సిబ్బంది ఏమయ్యారు?

సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీ రిజర్వ్ ఫారెస్టు పరిధిలో ఉండడంతో రాత్రి సమయంలో గస్తీ నిర్వహించడంతోపాటు ఇక్కడే ఇద్దరు అటవీ సిబ్బంది విధుల్లో ఉండేవారు. శుక్రవారం రాత్రి సిబ్బంది లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వ్యాపారులకు అటవీ శాఖ సిబ్బంది సహకారం ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

క్వారీ ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

నర్సీపట్నం డీఎఫ్‌వో రాజారావు, రూరల్ సీఐ రమణయ్య, ఎస్‌ఐ నారాయణరావు తదితర్లు క్వారీ ప్రాంతాలను శనివారం పరిశీలించారు. తవ్వకాల తీరును గమనించారు. తవ్విన మట్టి ఏమార్గంలో వెళ్లిందో తెలుసుకుంటున్నారు. క్వారీ ప్రాంతాల్లో తవ్వకాలపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.



సాలికమల్లవరంలో శుక్రవారం అర్ధరాత్రి తవ్వకాలు జరిగిన ప్రాంతం

సమగ్ర దర్యాప్తు: డీఎఫ్‌వో రాజారావు

నర్సీపట్నం: గొలుగొండ మండలం, సాలికమల్లవరం అటవీ ప్రాంతంలో జరిపిన రంగురాళ్ల తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో రాజారావు తెలిపారు. పాక శిథిలావస్థకు చేరడంతో బేస్ క్యాంపు తొలగించి, పెట్రోలింగ్ టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. తవ్వకాల వెనుక సిబ్బంది ప్రమేయం ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. మీటరు లోతు తవ్వకాలు జరిపి, మట్టిని వాహనాల్లో తరలించినట్టు సమాచారం ఉందన్నారు. నాతవరం, గొలుగొండ పోలీసులను అప్రమత్తం చేశామన్నారు. సీసీ పుటేజీల ద్వారా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. తవ్వకాల్లో ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించేదిలేదని డీఎఫ్‌వో పేర్కొన్నారు.

క్లుప్తంగా

విశాఖ స్టీల్‌ప్లాంట్ కొంటా..

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్



నర్సీపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ కమిటీ ముందుకు వస్తే ఉక్కు కర్మాగారాన్ని కొంటానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డా.కె.ఎ.పాల్ పేర్కొన్నారు. తన తండ్రి బర్నబాస్‌ను కలుసుకునేందుకు పాల్ శనివారం నర్సీపట్నం వచ్చారు. విశాఖపట్నం వెళ్తూ మార్గంమధ్యలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆగి ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ త్వరలోనే తనతో కలుస్తారని పాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి కాపాడలేని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ విశాఖ స్టీల్‌ప్లాంట్ కొనేందుకు బిడ్ వేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు సీమాంధ్రను సింగపూర్ చేస్తానని అధోగతి పాలు చేశారన్నారు. తాను నర్సీపట్నంలో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో సబ్ కలెక్టర్ కార్యాలయం అప్పుడు ఎలావుందో ఇప్పుడు అలానే ఉందన్నారు. ఇదేనా చంద్రబాబు చేసిన అభివృద్ధిని మండిపడ్డారు. చంద్రబాబు రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేశాడన్నారు.

గోశాల, అడవివరం వరకు 56 ఉచిత బస్సులు

విశాఖ: చందనోత్సవానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసిన నేపథ్యంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బి.అప్పలనాయుడు శనివారం సిబ్బందికి పలు సూచనలు చేశారు. సుమారు 160 బస్సులు గోశాల వరకు తిప్పేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. అలాగే కొండపై నుంచి గోశాల, అడవివరం వరకు 56 బస్సులు ఉచితంగా నడపనున్నట్టు చెప్పారు.

భూ తగాదాలో ఒకరి మృతి

- కేవీ శరభవరంలో సంఘటన
- పరారీలో నిందితుడు

నాతవరం: రెండు కుటుంబాల మధ్య భూ వివాదం కారణంగా జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి నాతవరం ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ అందించిన వివరాలు. మండలంలోని కేవీ శరభవరానికి చెందిన రేగటి గంగరాజు, వాకపల్లి రాజుబాబు మేనమామ మేనత్త పిల్లలు కావడంతో ఇద్దరికీ ఒకే చోట భూములు ఉన్నాయి. వీరు మధ్య గత మూడేళ్లుగా భూ సరిహద్దు విషయంలో తగదాలు ఉన్నాయి. పలు మార్లు గ్రామ పెద్దల సమక్షంలో ఇరువురికి నచ్చజెప్పారు. అయినా పంతాలకుపోయి తగాదాలు పడుతున్నారు. వాకపల్లి రాజుబాబు శనివారం సరిహద్దు పొలం గట్టుపై ఉన్న తాటిచెట్లు కొట్టేస్తున్నాడు. రెండు తాటి చెట్లు నరికేసరికి రేగటి గంగరాజు అక్కడకు చేరుకుని, తగదాలో ఉన్న చెట్లను ఎందుకు నరికేస్తున్నాంటూ నిలదీశాడు. ఇరువురి మధ్య కాసేపు వాగ్వాదం నెలకొని, ఒకరిపై ఒకరు చేయి చేసుకునేంత వరకు వెళ్లింది. గంగరాజును రాజుబాబు తీవ్రంగా కొట్టడంతో, గంగరాజు స్పృహ కోల్పోయి నేలపై పడిపోయాడు. దూరంగా పంట పొల్లాలో ఉన్న వారు గ్రహించి అక్కడకు చేరుకుని, గంగరాజుకు సపర్యలు చేసి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే గంగరాజు(60) మరణించినట్లుగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వచ్చి మృతదేహాన్ని చూసి తీవ్రంగా రోధించారు. మృతుని భార్య రేగటి సత్యవతి నాతవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, రూరల్ సీఐ రమణయ్య, ఎస్ఐ లక్ష్మీనారాయణ చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. సంఘటనకు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. నిందితుడు పరారీ కావడంతో గాలిస్తున్నామన్నారు. మృతుడు గంగరాజుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



సంఘటన స్థలంలో సీఐ, ఎస్ఐలతో నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

రేగుపాలెంలో చోరీ

8 తులాల బంగారం, 3 తులాల వెండి ఆభరణాల అపహరణ

యలమంచిలి: అంతా గాఢనిద్రలో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి 8 తులాల బంగారం, 3 తులాల వెండి వస్తువులు అపహరించుకుపోయారు. చోరీకి సంబంధించి యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్నిబాబు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రేగుపాలెం గ్రామానికి చెందిన రాజాన నాగమణి ఇంట్లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బెడ్రూమ్ కిటికీని తొలగించి, ఇంటి లోపలకి ప్రవేశించారు. బీరువా తెరిచి బంగారం, వెండి దోచుకెళ్లారు. ఇంకో బెడ్‌రూమ్‌లో నిద్రిస్తున్న బాధితులు శనివారం తెల్లవారుజామున నిద్ర లేచి చూసేసరికి గదిలో కిటికీ తొలగించి, బీరువా తెరిచి, మంచంపై బట్టలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్‌హెచ్ 16కు దగ్గరగా ఉన్న ఈ ఇంటిని క్లూస్ టీం, పోలీసులు శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



చోరీ ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి

70 కేజీల గంజాయి, వాహనం స్వాధీనం

చోడవరం రూరల్: ఏజెన్సీ ప్రాంతం నుంచి బొలేరో వాహనంలో పెద్ద మొత్తంలో గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని గంజాయి, వాహనంతో సహా చోడవరం పోలసులు పట్టుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు వెల్లడించిన వివరాలు. ఏజెన్సీలోని పాడేరు నుంచి జి.మాడుగులకు చెందిన వ్యక్తి గంజాయిని తరలిస్తున్నట్టు చోడవరం ఎస్ఐ సూర్యనారాయణకు ముందస్తు సమాచారం అందింది. దీంతో శనివారం మండలంలోని గౌరీపట్నం జంక్షన్ వద్ద మాటు వేశారు. ఏపీ 27 ఏబీ 2366 నంబర్ బొలేరో వాహనంలో తనిఖీలు నిర్వహించగా 35 ప్యాకెట్లలో సుమారు 70 కేజీల గంజాయి పట్టుబడింది. బొలేరోను నడుపుతున్న జి.మాడుగుల మండలానికి చెందిన జగ్గందొర నారాయణరావును అరెస్టు చేసి, గంజాయితోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. నిందితుడిని జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్టు పేర్కొన్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.లక్షా 40 వేలు ఉంటుందని అంచనా.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనం

ఆదివాసీ జాతీయ సదస్సు నిర్వహణ కమిటీ ఏర్పాటు

డాబాగార్డెన్స్: ఆదివాసీ జాతీయ సదస్సు నిర్వహణ కమిటీ ఏర్పాటైంది. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వచ్చే నెల 21న అఖిల భారత స్థాయి ఆదివాసీ సదస్సు జరగనుంది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో.. సదస్సు విజయవంతం చేయడంలో భాగంగా 17 మంది ప్రతినిధులతో ఆదివాసీ జాతీయ సదస్సు నిర్వహణ కమిటీ ఏర్పాటైంది. సదస్సు నిర్వహణ కమిటీ సభ్యుడు ఎస్.రామ్మోహన్‌ను ఆహ్వాన సంఘం కార్యదర్శిగా ఎన్నుకున్నారు. నిర్వహణ కమిటీ సభ్యులుగా ఊలం పార్వతి(విజయనగరం), ఎస్.నాగేశ్వరరావు(భద్రాద్రి కొత్తగూడెం), ఆహ్వాన సంఘం కోశాధికారిగా ఎం.లక్ష్మీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఏపీ కన్వీనర్ ధర్ముల సురేష్, తెలంగాణ కన్వీనర్ ముక్తి సత్యం, ఒడిశా కన్వీనర్ కేదార్ సబర్ మాట్లాడుతూ 9 శాతంగా ఉన్న ఆదివాసీలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. మే 21న జరిగే సదస్సుకు దేశ వ్యాప్తంగా 550 మందికి పైగా ఆదివాసీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆకాంక్ష

చోడవరం రూరల్: విద్యార్థులు కేవలం చదువుపైనే గాకుండా క్రీడల పట్ల కూడా ఆసక్తి కలిగి ఉండాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆకాంక్షించారు. శనివారం రాత్రి స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ సమకూర్చిన క్రీడా పరికరాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉత్సాహపరుస్తూ ప్రసంగించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీకి చైర్మన్‌గా నియమితులైన సిద్దార్థ రెడ్డి క్రీడల ప్రోత్సాహానికి పెద్దపీట వేస్తున్నారని అభినందించారు. ప్రభుత్వం అందించిన క్రీడా పరికరాలతో తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ బోర్డు డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్, పీఈటీ, జ్యోతుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ విద్యార్థులకు క్రీడా పరికరాలు అందిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

ఏయూతో కూర్మ ఐటీ సొల్యూషన్స్ ఎంవోయూ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కూర్మ ఐటీ సొల్యూషన్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, కూర్మ ఐటీ సొల్యూషన్స్ సీఈవో పి.అప్పలనాయుడు సంతకాలు చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఆచార్య ఎస్.బాలప్రసాద్, పి.అచ్యుత సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

• నూతన జేసీకి చిక్కాల అభినందనలు

జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవిని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు కలిశారు. కొత్త జేసీగా బాధ్యతలు చేపట్టినందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు రామారావు పూలమొక్కను అందజేశారు. ఆయన వెంట డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఉన్నారు. -తుమ్మపాల



క్లుప్తంగా

26న నేత్ర వైద్య శిబిరం

కశింకోట : స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 26న వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. శిబిరంలో అన్ని రకాల కంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, నిరు పేదలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కంటి సంబంధిత రోగాలతో బాధపడేవారు వినియోగించుకోవాలని కోరారు.

24న విజయవాడలో జై భారత్ సత్యాగ్రహ దీక్ష

అనకాపల్లిటౌన్ : ఈనెల 24న విజయవాడలో జై భారత్ సత్యాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్టు పీసీసీ సభ్యుడు, నర్సీపట్నం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి మీసాల సుబ్బన్న అన్నారు. స్థానిక న్యూకాలనీ పార్టీ సీనియర్ నాయకుడు పి.ఎస్.దత్తు స్వగృహంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యాగ్రహ దీక్షలో రాహుల్ గాంధీకి పూర్తి మద్దతు దేశవ్యాప్తంగా ఇస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. విజయవాడలో జరిగే దీక్షకు జిల్లాలో పార్టీ నాయకులు, శ్రేణులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తియాదవ్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలపై సీపీఎం నిరసన

రాంబిల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన కొత్తపట్నం, అప్పారాయుడుపాలెం గ్రామాల్లో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను అవలంభిస్తుందని, ప్రజా సంక్షేమం గాలి కొదిలేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నారాయణరావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వివాదాల్లేకుండా సరిహద్దు రాళ్ల ఏర్పాటు

మాకవరపాలెం : సమగ్ర భూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటు పనులను నర్సీపట్నం ఆర్డీవో జయరాం శనివారం పరిశీలించారు. మండలంలోని జంగాపల్లిలో జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో రీ సర్వే పూర్తి కావడంతో సరిహద్దు రాళ్లు వేసే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో పరిశీలించి, వివాదాలకు తావులేకుండా త్వరితగతిన ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 2,169 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	--	--
మొదటి రకం	3,800	4,200
రెండో రకం	3,440	3,890
మూడో రకం	3,320	3,440

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
కలియుగ భగవాన్	సత్యనారాయణ స్క్రీన్-1
ఈవిల్ డెడ్ రైజ్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
విరుపాక్ష	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
శాకుంతలం	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 435 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 357 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

గడప గడపలో జగన్ పాలనకు జేజేలు



లబ్ధిదారునికి సంక్షేమ పుస్తకం అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

- మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజల మద్దతు
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించే సమయంలో లబ్దిదారుల కళ్లల్లో సంతోషం, ప్రభుత్వంపై వారికి పెరిగిన విశ్వాసం స్పష్టంగా కనిపిస్తోందని రాష్ట పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతిలు అన్నారు. జీవీఎంసీ విలీనగ్రామాలైన కొత్తూరు, నర్సింగరావుపేట, సిరసపల్లి గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రపంచ విపత్తులో ఒకటైన కరోన వంటి సమయంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వానికి ఆదాయం లేకపోయినప్పటికీ అర్హత కలిగిన ప్రతి వ్యక్తి సంక్షేమ పథకాలు అమలు చేసిన దేశచరిత్రలో ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాలన సాగుతుందని ఆయన చెప్పారు. జాతీయ రహదారికి అనుకుని ఉన్న జీవీఎంసీ విలీన గ్రామంల్లో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యలు కొన్ని ప్రాంతాల్లో ఉన్నాయని, నెలరోజుల్లో సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అగనంపూడి నుంచి అనకాపల్లికి రూ.35 కోట్లతో తాగునీటి పైప్‌లైన్లు పనులు జరుగుతున్నాయని, విలీన గ్రామాలకు పరిశుభ్రమైన నీటిని అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మరో సారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించి మరిన్ని సంక్షేమ పథకాలు బడుగు, బలహీన వర్గాల ప్రజలు ప్రభుత్వం నుంచి తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ దశలవారిగా పార్లమెంట్ పరిధిలో ఎంపీ నిధుల నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ నేతలు కరణం సురేష్, గొల్లవిల్లి రమణ, అప్పారావు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ పరిరక్షణకు మొక్కలు పెంచాలి



కాలనీవాసులకు మొక్కలు అందిస్తున్న పరిషత్ సభ్యులు

అనకాపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ భూ పరిరక్షణకు, మానవుల ఆరోగ్యానికి ఔషధ గుణాలు కలిగే మొక్కలు పెంచాలని భారత వికాస్‌పరిషత్ అధ్యక్షుడు ఓంరాం అన్నారు. స్థానిక గవరపాలెం సాయిబృందానంకాలనీ 4వవీధిలో పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ధరిత్రీ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రణపాల, మునగ, తిప్పతీగ, కర్పూరతులసి, దానిమ్మ వంటి మొక్కల్లో ఎక్కువగా ఔషధ గుణాలుంటాయని పేర్కొన్నారు. వాటి ఉపయోగాలను వివరించారు. అంతకుముందు పరిషత్ రాష్ట్ర పర్యావరణ కన్వీనర్ ఎస్. నూకరాజు సహకారంతో కాలనీవాసులకు ఔషధ గుణాలు కలిగిన మొక్కలతోపాటు పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

శారదాపార్కును అభివృద్ధి చేయాలి

అనకాపల్లిటౌన్: స్థానిక శారదానది ఒడ్డున శారదా పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమ్‌ఆద్మీపార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్ బాబు అన్నారు. శనివారం పార్టీ నేతలు పార్కు ను పరిశీలించి మాట్లాడారు. 2016వ సంవత్సరంలో పార్కు చుట్టూ ప్రహరీ గోడను రూ.19.89 లక్షల నిధులతో నిర్మించిన అధికారులు పార్కులోపల అభివృద్ధి చేయకపోవడం అన్యాయమన్నారు. వేసవి కాలంలో చిన్నారులు, వృద్ధులు ఉదయం, సాయంత్రం సమయాల్లో పార్కుల్లో ఆటలు ఆడుకుంటారని ఆయన పేర్కొన్నారు. పార్కు 30 సెంట్లు విస్తీరణ కలిగి ఉందన్నారు. పట్టణ పరిధిలో ఉన్న ఏకైక పార్కును అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనులకు శ్రీకారం



బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న దంతులూరి దిలీప్ కుమార్

అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాల వాటర్ ట్యాంకు వద్ద శనివారం బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయంలో ఎంతో కాలంగా ఇక్కడ బోర్‌వెల్ ఏర్పాటు వాయిదా పడుతూ వచ్చింది. చివరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు,నేతల చొరవతో బోర్‌వెల్ కోసే పని కార్యరూపం దాల్చింది.పనుల ప్రారంభానికి ముందు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ కొబ్బరికాయ కొట్టి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తుమ్మపాలలో దీర్ఘకాలికంగా పరిష్కారంకాని సమస్యలు శాశ్వతంగా పరిష్కరించామన్నారు. ప్రజలు గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో తేడాని గమనించాలని కోరారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి,విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీ వడ్డాది భారతి,వడ్డాది అశోక్,ఉపసర్పంచ్ చదరం చిన్నా,బుద్దాల హరి,పెంటకోట రాజు,వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

అనకాపల్లిటౌన్: వేసవి కాలంలో పాదచారులకు, వాహనదారులకు వడదెబ్బ తగలకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రశాంతినికేతన్ స్కూల్స్ కరస్పాండెంట్ డి.వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పూడిమడక రహదారి స్కూల్ సమీపంలో శనివారం ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ చలివేంద్రం మూడునెలలు పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అగనంపూడి స్కూల్ కరస్పాండెంట్ డి.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

రాంబిల్లి: మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. రెవెన్యూ అధికారులు మండలంలో మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అయితే శనివారం మామిడివాడ, కొత్తూరు, గోకివాడ పరిధిలో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరిపి తరలిస్తుండగా పలువురు ఆర్డీవో చిన్నికృష్ణ ఇతర అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం మట్టి తవ్వకాలు, తరలింపునకు అనుమతులు తీసుకోవాలి. అయితే అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు ఇతర అవసరాలకు పొక్లెయిన్‌లతో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో దర్జాగా తరలించుకుపోతున్నారు. ట్రాక్టరు మట్టిని రూ.1000 నుంచి రూ.1200 ధరకు అమ్ముకుంటున్నారు. ఎస్‌ఐ దీనబంధు మట్టి తవ్వకాలపై స్పందించి విచారణ జరుపుతామన్నారు. ఆర్డీవో చిన్ని కృష్ణ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చోరీలపై అప్రమత్తతకు గ్రామాల్లో ప్రచారం



దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రచారం చేస్తున్న రూరల్ పోలీసులు

యలమంచిలి : దొంగతనాలపై అప్రమత్తత కలిగి ఉండాలని రూరల్ ఎస్‌ఐ కె.సన్నిబాబు అన్నారు. ఇటీవల కాలంలో చోరీలు అధికమవడంతో శనివారం యలమంచిలి మండలంలోని పలు గ్రామాల్లో దొంగతనాలపై మైక్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో ప్రజలు ఆరుబయట పడుకోవడం ఆనవాయితీ అని, కానీ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో తలుపులు గడియలు వేసుకోవాలని, దూరపు ప్రయాణాలకు వెళితే స్థానిక పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు. రాత్రిపూట గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు,అనుమానితులు,సంచరిస్తే తక్షణమే తమకు సమాచారం చేరవేయాలన్నారు. ఇంట్లోని విలువైన వస్తువులు బ్యాంకుల్లో భద్రపరచుకోవాలని, రాత్రి పూట ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, యలమంచిలి రూరల్‌లో కొన్ని గ్రామాలు జాతీయ రహదారికి దగ్గరగా ఉన్నాయని, అందువల్ల రాత్రి పూట ప్రత్యేక నిఘా పెడుతున్నామని తెలిపారు. చోరీల నియంత్రణలో భాగంగా పోలీసులకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలో అన్ని గ్రామాల్లో శనివారం ఆటోలో మైక్ ప్రచారం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

ఖాళీ కంచాలతో నిరసన



ఖాళీ కంచాలతో నిరసన తెలుపుతున్న ముఠా కార్మికులు

రాంబిల్లి: రసూల్ డెకర్ పరిశ్రమ వద్ద శని వారం ముఠా కార్మికులు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ కంచా లతో నిరసన వ్యక్తం చేశారు. 18 రోజులుగా ధర్నా నిర్వహిస్తున్న ముఠా కార్మికులకు రసూల్ కంపెనీ యాజమాన్యం న్యాయం చేయాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఆర్. రాము డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు నానాజీ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే పోటీ పరీక్షల్లో రాణింపు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే పోటీ పరీక్షల్లో రాణించవచ్చని విశ్రాంత ఎంఈవో సూర్యారావు అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి,కష్టపడి చదువుకుంటే పాలిసెట్‌లో ర్యాంక్‌లు సాధించవచ్చన్నారు. సాంకేతిక విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిషత్ సొంతమవుతుందన్నారు. ధ్యానగురువు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎర్రంశెట్టి అనిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి: మండలంలో శనివారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గోకివాడ వద్ద విద్యుత్ తీగ తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కొత్తూరు, మామిడివాడ, దిమిలి, కట్టుబోలు పరిసర గ్రామాలకు సాయంత్రం నుంచి రాత్రి 7.30 వరకు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతు పనులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

ప్రజా సంక్షేమమే పరమావధిగా జగన్ పాలన



రామనాయిడుకాలనీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : జగనన్న ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతుందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం 81వ వార్డు పరిధిలో రామనాయుడు కాలనీలో ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమాన్ని శనివారం వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య ఆధ్వర్యంలో ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందనిపేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్ కారణంగా రాష్ట్రాం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి పీలా రాంబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబి, పార్టీ నాయకులు పీలా శ్యామ్, దాడి ఈశ్వరరావు, మద్దాల భీమేష్, కాండ్రేగుల ఆదిబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన



తాళ్లపాలెం ఎస్సీ కాలనీలో సంక్షేమ, అభివృద్ధి పథకాల బ్రోచర్ల పంపిణీ

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం ఎస్సీ కాలనీలో సచివాలయ కన్వీనర్లు లగిశెట్టి గణేష్, గుమ్మడి నారాయణరావుల ఆధ్వర్యంలో ‘జగనన్నే మా భవిష్యత్తు’కార్యక్రమాన్ని శనివారం నిర్వహించా రు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై రూపొందించిన బ్రోచర్లను ఇంటింటికి పంపిణీ చేశారు. గృహ యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్ల గోడలకు అతికించారు. జగన్ చిత్రంతో కూడి బ్యాడ్జిలను అందించారు. ప్రజా మద్దతు పుస్తకంలో స్థానికుల సమాధానాలను నమోదు చేసుకున్నారు. సీఎం జగన్ పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి నే గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గృహ సారథులు, పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చందనోత్సవానికి సన్నాహాలు



కశింకోటలోని లక్ష్మీనృసింహస్వామి

కశింకోట : స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం వైశాఖ శుద్ధ తదియ పురస్కరించుకుని చందనోత్సవానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి శనివారం తెలిపారు. చందనోత్సవం సందర్భంగా ఆ రోజు తెల్లవారుజాము 4 గంటల నుంచి చందనాన్ని శాస్త్రోక్తంగా తొలగించి స్వామి నిజరూప దర్శనాన్ని ప్రజలకు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వేద మంత్రాల నడుమ నిజరూప స్వామికి చందనాన్ని పూసి పూజలు చేస్తామన్నారు. అనంతరం చందన రూపంలో స్వామిని భక్తులు దర్శించుకోవచ్చన్నారు.

నాలుగు పశువుల పాకలు దగ్ధం

మాకవరపాలెం : అగ్ని ప్రమాదంలో నాలుగు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. మండలంలోని లచ్చన్నపాలెం గ్రామ శివారులో గుడివాడ దేముడు, కిల్లాడ అచ్చమ్మ, కన్నూరు రాములమ్మ, నూకరాజులకు చెందిన పశువుల పాకలు శనివారం ఉదయం దగ్ధమయ్యాయి. రైతులు తెల్లవారుజామునే పశువులను బయటకు తీసుకురావడంతో వాటి ప్రాణాలకు నష్టం కలగలేదు. లేకుంటే రూ.లక్షల్లో ఆస్తినష్టం వాటిల్లేదని రైతులు తెలిపారు. ఈ ప్రమాదంలో కోళ్లు, పశుదాణా పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

దిబ్బవీధిలో శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం

అనకాపల్లిటౌన్ : గవరపాలెం దిబ్బవీధిలో వెలసిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి చందనోత్సవ కార్యక్రమం, స్వామివారి నిజరూప దర్శనం ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారు జాము 2 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, 2.30 గంటలకు చందన వలుపు, తెల్లవారుజాము 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్వామి నిజరూప దర్శనం, సాయంత్రం 5.30 గంటలకు స్వామివారికి పంచామృత అభిషేకాలు, సహస్ర కలశాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్



విరాళాల సేకరణ



కశింకోటలో ఈద్ ముబారక్ చెప్పకుంటున్న ముస్లింలు



కశింకోటలో మత గురువు బోధనలు



నరసింగబిల్లి మసీదు వద్ద ముస్లింల రంజాన్ ప్రార్థనలు

కశింకోట : స్థానిక నూకాంబిక ఆలయ సమీపంలోని ఈద్-ఘాహ్ వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు జరిపారు. మత గురువు అల్లా బోధనలను వినిపించారు. పేదల సహాయార్థం విరాళాలు సేకరించారు. అనంతరం పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ బాబర్, నూరీ మసీదు కమిటీ అధ్యక్షుడు ఎస్.రహంతుల్లా, కార్యదర్శి ఎస్ఎంఎం అలీ, ముస్లిం ప్రతినిధులు ఎంఎ రబ్బాని, షఫీ, ఐఎం షరీఫ్, మన్సూర్ ఆలం, బబ్లూ, సయ్యద్‌సలీం, హాజీ హాసన్, సయ్యద్ నయీం, సయ్యద్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు. నరసింగబిల్లిలోని మసీదులో కూడా రంజాన్ ప్రార్థనలు నిర్వహించి పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మసీదు కమిటీ ప్రతినిధులు షేక్ బాబ్జీ, షేక్ రెహమాన్, షేక్ ఇస్మాయిల్, షేక్ ఎండీ రబ్బాని, షేక్ అబ్దుల్ రెహమాన్, షేక్ అబ్దుల్ అహ్మద్, షేక్ సుభాన్, ఎస్‌కే అన్సర్‌వల్లి, ఎస్‌కే మదీనా మల్లేష్ పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్ : వేల్పులవీధి మెయిన్‌రోడ్డులో ముస్లింలు ఏర్పాటు చేసి ఎంతో పవిత్రంగా వండిన(కీర్) సేమియా పాయసాన్ని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి పంపిణీ చేశారు.

రీ-సర్వేతో రైతులకు మేలు

మునగపాక:ప్రతి రైతు రీ-సర్వేను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలో శనివారం ఆయన రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీ-సర్వే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ భూములకు సంబంధించి సరిహద్దు విషయాల్లో రైతుల మధ్య వివాదాలు జరుగుతుండేవన్నారు. ఈ పద్ధతి ద్వారా రానున్న రోజుల్లో వివాదాలకు తావు లేకుండా ఉంటుందన్నారు. రైతులు కూడా సర్వే చేసే సిబ్బందికి సహకరించాలన్నారు. రైతులు పెతకంశెట్టి జోగినాయుడు, మళ్ల జోగినాయుడు, మళ్ల కన్నుంనాయుడు, భాస్కరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చివరి దశకు ఖరీఫ్ వరి నూర్పులు

రాంబిల్లి: మండలంలో ఖరీఫ్ వరి నూర్పిడి పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఖరీఫ్ వరి కోతలు అనంతరం అపరాలు సాగు చేసిన పొలాల్లో వరి నూర్పులు ఆలస్యమయ్యాయి. అపరాలు పనులు అనంతరం రైతులు వరి నూర్పులు చేస్తున్నారు. నూర్పిడి పనులకు రైతులు యంత్రాలను వినియోగిస్తున్నారు. మరోపక్క నూర్పిడి పనులు పూర్తి అయిన తర్వాత గడ్డిని రైతులు విక్రయిస్తున్నారు. మండలం నుంచి పలు ప్రాంతాలకు వరిగడ్డి ఎగుమతి అవుతుంది.